క్లుప్తంగా

సాక్షిగణపతికి విశేష పూజలు


సాక్షిగణపతి


జ్వాలా వీరభద్రస్వామి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో లోకకల్యాణార్థం బుధవారం సాయంత్రం సాక్షి గణపతి స్వామికి అభిషేకం, ఆలయ ప్రాంగణంలోని జ్వాలా వీరభద్రస్వామికి విశేష పూజలు నిర్వహించారు. సాక్షి గణపతి స్వామికి పంచామృతం, ఫలోదకం, హరిద్రోదకం, గంధోదకం, పుష్పోదకం, కలశోదకం, శుద్ధజలంతో అభిషేకాలు చేసి విశేష పుష్పార్చన, నివేదన కార్యక్రమాలు చేశారు.

శారదా పీఠంలో గణపతి, రుద్రహోమాలు


హోమం నిర్వహిస్తున్న పీఠాధిపతి శ్రీశివయోగీంద్ర సరస్వతి స్వామిజీ

మహానంది: బండిఆత్మకూరు మండలం కాకనూరు గ్రామంలో వెలిసిన శారదాపీఠంలో రెండురోజుల పాటు జరిగిన సద్గురు సరస్వతీ నారాయణ తీర్థ స్వామి అష్టమ ఆరాధన మహోత్సవాల్లో భాగంగా బుధవారం గణపతి, రుద్ర, శాకాంబరీ హోమాలు వైభవంగా నిర్వహించారు. పీఠాధిపతి శివయోగేంద్ర సరస్వతి స్వామి ఆధ్వర్యంలో గణపతిపూజ, పుణ్యాహవాచనం, లక్ష్మీ గణపతిహోమం, రుద్ర, శాకాంబరి హోమం, పూర్ణాహుతి, మంగళ హారతులు చేపట్టారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులకు అన్నప్రసాదాలు పంపిణీ చేశారు.

మహానందిలో భక్తుల సందడి


కామేశ్వరీదేవిని దర్శించుకుంటున్న భక్తులు

మహానంది: మహానందీశ్వరుడి సన్నిధిలో బుధవారం భక్తుల రద్దీ నెలకొంది. ఆషాఢ మాసం సందర్భంగా పలు ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారికి చీర, సారె సమర్పించారు. కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించిన కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లతో పాటు కోదండరామాలయం, వినాయక నంది, గరుడనంది ఆలయాలను సందర్శించారు.

ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ


మాట్లాడుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఆత్మకూరు: మండలంలోని కురుకుంద గ్రామంలో బుధవారం ఆత్మకూరు మండల అధ్యక్షుడు వనమాల పుల్లయ్య మాదిగ అధ్యక్షతన ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ జాతీయ నాయకులు చిలుక రాబిన్ సన్ మాదిగ మాట్లాడుతూ హక్కుల సాధనకై ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు బాషాపోగుల దరగయ్య మాదిగ, బుజ్జి మాదిగ, పెద్దదేవ సహాయం మాదిగ, శాబోలు రామారావు వరదరాజు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు


మురుగు కాల్వలో పూడికను తొలగిస్తున్న దృశ్యం

వెలుగోడు: మండల కేంద్రంలోని వెలుగోడు పట్టణంలో బుధవారం ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. మేజర్ పంచాయతీ సర్పంచ్ వేల్పుల జయపాల్ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య కార్మికులు డ్రైనేజీల్లోని మురుగును తొలగించారు. దోమలు వ్యాప్తి చెందకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లారు. వీధులు, రహదారులకు ఇరువైపులా ఉన్న చెత్తను ట్రాక్టర్‌తో శివారు ప్రాంతాలకు తరలించారు.

పొదుపు సంఘాలకు రుణాలు

నంద్యాల(న్యూటౌన్): ఈ ఆర్థిక సంవత్సరంలో బ్యాంక్ లింకేజీ కింద 21,706 స్వయం సహాయక సంఘాలకు రూ.1168.31 కోట్ల రుణాలు ఇవ్వనున్నట్లు పీడీ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. ఇప్పటి వరకు 2,886 స్వయం సహాయక సంఘాలకు 219.11 కోట్లు బ్యాంకుల ద్వారా ఇప్పించినట్లు తెలిపారు. బుధవారం డీఆర్‌డీఏ సమావేశ భవనంలో జిల్లా అధికారులు, బ్యాంకు కంట్రోలర్లతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడారు. సెప్టెంబర్ 30వ తేదీ నాటికి రూ.600 కోట్ల రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలిపారు.

పండ్ల తోటలతో గిరిజనుల జీవనం మార్పు

- జిల్లా ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారి నరేంద్ర రెడ్డి


గిరిజనులకు పండ్ల మొక్కలను పంపిణీ చేస్తున్న అధికారులు

కొత్తపల్లి: పండ్ల తోటల పెంపకం ద్వారా గిరిజనుల జీవన స్థితిగతుల్లో మార్పు వస్తుందని, గిరిజనులు పండ్ల తోటల సాగుకు ముందుకు రావాలని జిల్లా ప్రకృతి వ్యవసాయ శాఖ అధికారి నరేంద్ర రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని పాలెం చెరువు గ్రామ గిరిజన ఆశ్రమ పాఠశాల ఆవరణలో గిరిజనులకు పండ్ల మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ఐదంతస్తుల పండ్ల తోటల పెంపకాన్ని గిరిజనులు చేపట్టాలని చెప్పారు. వాటితో పాటు తోటల్లో అంతర పంటలు కూడా సాగు చేసుకోవాలని సూచించారు. దీని ద్వారా రైతులు నిరంతర ఆదాయం పొందుతూ ఆర్థికంగా బలోపేతమవుతారని వివరించారు. ఈ ప్రాంతంలో 11 మంది రైతులకు గాను 23 ఎకరాల మామిడి, సపోటా, నిమ్మ, జామ, కొబ్బరి, ఎర్రచందనం, మహాగని,సీతాఫలం తో కలిపి 4000 పండ్ల మొక్కలను పంపిణీ చేశామన్నారు. వ్యవసాయ అధికారి కే.మహేష్, సేర్టీస్ ప్రోగ్రాం మేనేజర్ బి.నారాయణ, జిల్లా ప్రకృతి వ్యవసాయ అదనపు అధికారి అబ్దుల్ సలాం పాల్గొన్నారు.

వీబీఆర్ కట్టకు మరమ్మతులు


మట్టిని తోలుతున్న దృశ్యం

వెలుగోడు: కోతకు గురైన వెలుగోడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు తెలుగు గంగ అధికారులు మరమ్మతులు చేశారు. ఇటీవల కురిసిన వర్షానికి ఆత్మకూరు–నంద్యాల ప్రధాన రహదారి వైపు వీబీఆర్ కట్టపై గుంత ఏర్పడింది. బుధవారం కోతకు గురైన ప్రాంతంలో మట్టిని వేసి గుంతను పూడ్చారు. కట్ట పటిష్టంగానే ఉందని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని తెలుగు గంగ అధికారులు పేర్కొన్నారు. కాగా, బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి లింక్ చానల్ ద్వారా వీబీఆర్‌కు కృష్ణా జలాలు వచ్చి చేరుతున్నాయి. ప్రస్తుతం 5 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. వీబీఆర్‌లోకి నీరు వచ్చి చేరుతుండడంతో ఆయకట్టు రైతులు నారుమడులు సిద్ధం చేసుకుంటున్నారు.

వన్ తూము గేటు ఎత్తివేత

రైతుల అభ్యర్థన మేరకు వీబీఆర్ పరిధిలోని వన్ ఆర్ తూమును ఎత్తి నీటిని దిగువకు విడుదల చేశారు. టీడీపీ మండల అధ్యక్షుడు అన్నారపు శేషిరెడ్డి, స్థానిక నాయకులు, రైతులు ప్రత్యేక పూజలు చేసి గేటు ఎత్తి నీటిని విడుదల చేశారు. పంటలు ఎండిపోతున్న తరుణంలో నీటిని విడుదల చేయడంపై రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నేడు శ్రీశైలానికి సీఎం చంద్రబాబు రాక

- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ


ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా

శ్రీశైలంటెంపుల్: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గురువారం శ్రీశైలం రానున్నారు. ఉదయం 9 గంటలకు విజయవాడలోని ఉండవల్లి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరి సున్నిపెంట హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో శ్రీశైలం చేరుకుంటారు. ముందుగా సాక్షిగణపతి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అనంతరం మల్లికార్జున స్వామివారికి అభిషేకం, భ్రమరాంబాదేవికి కుంకుమార్చన తదితర పూజలు చేయనున్నారు. ఆలయం నుంచి శ్రీశైలం డ్యాం వద్దకు వెళ్లి అక్కడ జరిగే జలహారతి కార్యక్రమంలో పాల్గొననున్నారు. కాగా సీఎం హోదాలో నాలుగో సారి శ్రీశైలం వస్తున్నారు. గతంలో 2001లో గంగా సదన్–గౌరీ సందన్ ప్రారంభోత్సవం, 2016లో కృష్ణా పుష్కరాలు, 2018లో జలహారతి కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు.

పటిష్ట బందోబస్తు

సీఎం పర్యటన నేపథ్యంలో కలెక్టర్ రాజకుమారి, ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా, జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్ బుధవారం ఏర్పాట్లను పరిశీలించారు. భద్రతా పరంగా తీసుకోవాల్సిన చర్యల గురించి పోలీస్, ఆలయ అధికారులకు దిశానిర్దేశం చేశారు. సుమారు 1100 మంది పోలీసులతో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశారు. నల్లమల ప్రాంతంలో ఏఆర్, స్పెషల్ పార్టీ పోలీసులతో కూంబింగ్ నిర్వహించారు. అలాగే బాంబ్ స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహిస్తున్నారు.

రెండు రాష్ట్రాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు విస్తరిస్తాం


ఈఓకు వినతి పత్రం అందిస్తున్న డైరెక్టర్ మీనాక్షి శ్రీనివాస్, కోఆర్డినేటర్ నర్సింగరావు

మహానంది: వేంకట అన్నమాచార్య సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో రెండు తెలుగు రాష్ట్రాల్లో సేవా, ఆధ్యాత్మిక కార్యక్రమాలు విస్తరిస్తామని ట్రస్ట్ తెలంగాణ రాష్ట్ర డైరెక్టర్ మీనాక్షి శ్రీనివాస్, కోఆర్డినేటర్ నర్సింగరావు తెలిపారు. మహానందీశ్వరుడి దర్శనార్థం వచ్చిన వారు ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డిని కలిసి తాళ్లపాక స్వామివారి ప్రసాదాలు అందించి వినతిపత్రం ఇచ్చారు. వారు మాట్లాడుతూ ప్రముఖ పుణ్యక్షేత్రాలైన తిరుమల, ఒంటిమిట్ట, సింహాచలం తదితర ఆలయాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలైన కోలాటం, భజనలు, సేవాకార్యక్రమాలు చేస్తున్నామన్నారు. మహానందిలోనూ అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేస్తూ వినతిపత్రం ఇచ్చారు. ఏఈఓలు మధు, ఓంకారం వేంకటేశ్వరుడు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శశిధర్‌రెడ్డితో వారు ఆధ్యాత్మిక అంశాలపై చర్చించారు.

ఎస్ఎంసీ ఎన్నికల షెడ్యూల్ విడుదల

మిడుతూరు/పాములపాడు/పగిడ్యాల: స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) ఎన్నికల షెడ్యూల్ విడుదలైందని మిడుతూరు, పాములపాడు, పగిడ్యాల ఎంఈఓలు రామిరెడ్డి, ఎంఈఓ బాలాజీనాయక్, సుభాన్ తెలిపారు. బుధవారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల (చైర్మన్, వైస్ చైర్మన్, ఎస్ఎంసీ సభ్యులు) పునర్వ్యవస్థీకరణ ఎన్నికల నిర్వహణకు నోటిఫికేషన్ జారీ అయ్యిందన్నారు.ఈనెల 1వ తేదీ ఎన్నికల నిర్వహణ కోసం ఓటరు జాబితా ప్రదర్శన, 5న ఓటరు జాబితాపై అభ్యంతరాల స్వీకరణ, ఏవైనా ఫిర్యాదులు ఉంటే పరిష్కరించడం, ఎన్నికల నిర్వహణకు ఓటరు జాబితా తయారు చేసి నోటీస్ బోర్డులో ప్రదర్శించడం, 8న ఎన్నికల నిర్వహణ ముగింపు, కమిటీ సభ్యులతో చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికల నిర్వహణ, ప్రమాణ స్వీకారం, మొదటి కమిటీ సమావేశం నిర్వహిస్తారని వివరించారు. సమస్యాత్మక గ్రామాలపై పోలీసులకు ముందస్తు సమాచారం ఇవ్వాలని సూచించారు. ముందుగా కమిటీ సభ్యులను ఎన్నుకున్న అనంతరమే చైర్మన్, వైస్ చైర్మన్‌లను ఎన్నుకోవాలని ఆదేశాలు ఉన్నాయని పేర్కొన్నారు.

నందికొట్కూరు రూరల్ సీఐగా సుధాకర్‌రెడ్డి


రూరల్ సీఐగా సుధాకర్‌రెడ్డి, టౌన్ సీఐగా ప్రవీణ్‌కుమార్‌రెడ్డి

నందికొట్కూరు: నందికొట్కూరు రూరల్ సీఐగా సుధాకర్‌రెడ్డి, టౌన్ సీఐగా ప్రవీణ్‌కుమార్‌రెడ్డిని నియమించినట్లు ప్రభుత్వం బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. సీఎం చంద్రబాబు శ్రీశైలం పర్యటన ముగిసిన తర్వాత సీఐలు ఇద్దరూ బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం. రూరల్ సీఐ ప్యాపిలి నుంచి, టౌన్ సీఐ పత్తికొండ నుంచి బదిలీపై రానున్నారు.

ఆత్మకూరు ఎస్‌డీపీఓగా రామంజినాయక్



ఆత్మకూరు: ఆత్మకూరు ఎస్‌డీపీఓగా ఆర్.రామంజి నాయక్‌ను నియమిస్తూ డీజీపీ ద్వారకా తిరుమల రావు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఇక్కడ పనిచేస్తున్న ఎ.శ్రీనివాసరావును నెల్లూరు డీఎస్పీ, ఎస్‌బీగా బదిలీ చేశారు. త్వరలోనే ఆర్.రామంజి నాయక్ ఆత్మకూరులో బాధ్యతలు తీసుకోనున్నారని పోలీసు వర్గాలు తెలిపాయి.

ఉదయాన్నే పింఛన్ పంపిణీ ప్రారంభమవ్వాలి

కొత్తపల్లి: ఆగస్టు నెల సామాజిక పింఛన్ పంపిణీ గురువారం ఉదయం ఆరు గంటలకే ప్రారంభం కావాలని ఎంపీడీఓ జవహర్ బాబు బుధవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది ఉదయం నుంచే పంపిణీ ప్రక్రియ చేపట్టాలన్నారు. పింఛన్ పంపిణీలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. మండలంలో 11 సచివాలయాల పరిధిలో 4,248 మంది లబ్ధిదారులకు గాను రూ.1,74,63,500 ఆయా సచివాలయాలకు పంపించామని వివరించారు.

కొట్టాల చెరువులో హాస్టల్ నిర్మిస్తాం


అధికారులతో మాట్లాడుతున్న డీఈఓ శ్రీనివాసరెడ్డి

ఆత్మకూరు: మండలంలోని కొట్టాల చెరువు గ్రామంలో గిరిజన బాలుర వసతి గృహాన్ని నిర్మిస్తామని డీఈఓ శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం ఆయన గ్రామంలో పర్యటించారు. ప్రజలతో మాట్లాడారు. గ్రామంలో 5వ తరగతి వరకు ఉన్న తరగతిని పెంచి ఏడో తరగతి వరకు ఇక్కడ విద్యాబోధన జరిగేలా చేస్తామని హామీ ఇచ్చారు. కొట్టాల చెరువులో గిరిజన బాలుర హాస్టల్‌ను ఏర్పాటు చేసేందుకు కృషి చేసిన ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్‌రెడ్డికి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.


ఈఓపీఆర్డీని సన్మానిస్తున్న ఎంపీపీ,సర్పంచ్‌లు, ఉద్యోగులు


ఎంఈఓ శ్రీరాములను సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

నిస్వార్థ సేవలకే గుర్తింపు

జూపాడుబంగ్లా: ప్రభుత్వ ఉద్యోగులు నిస్వార్థంగా సేవలు అందించినప్పుడే సమాజంలో గుర్తింపు లభిస్తుందని ఎంఈఓ–1 చిన్నమద్దిలేటి, ఎంఈఓ–2 శ్రీనివాసులు తెలిపారు. మండలంలోని తాటిపాడు ప్రాథమికోన్నత పాఠశాలకు చెందిన కె.లక్ష్మీనారాయణ, ఎస్.అహమ్మద్‌హుసేన్ పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా బుధవారం స్థానిక వైఎస్సార్ ఫంక్షన్ హాల్‌లో వారికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం పదవీ విరమణ పొందిన ఉపాధ్యాయుల సేవలను కొనియాడటంతో పాటు వారిని సన్మానించి, బహుమతులను అందజేశారు. ఉపాధ్యాయ జేఏసీ నాయకులు డి.జాకీర్‌హుసేన్, శేషన్న, ఉస్మాన్‌బాషా, హనుమంతరెడ్డి, సతీష్‌చంద్ర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పదవీ విరమణ తప్పనిసరి

పాములపాడు: ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పనిసరి అని ఎంపీపీ తొగురు సరోజినీ వర్ధినియ అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓపీఆర్డీగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాసులు నాయుడు బుధవారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ ఉద్యోగ సర్వీసులో ప్రజలకు చేసిన మంచి ఎప్పటికీ గుర్తుండిపోతుందని చెప్పారు. అనంతరం ఇన్‌చార్జ్ ఎంపీడీఓ కరుణ సాగర్, ఎంఈఓ 2 సుభాషిణి, ఏఓ ఫణీశ్వరరెడ్డి, లైబ్రేరియన్ కృష్ణారెడ్డి, హెల్త్ ఎడ్యుకేటర్ మల్లికార్జున, ఏపీఓ విమలమ్మ, ఏపీఎం అనురాధ, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచులతో కలిసి ఆయనను సన్మానించారు.

శ్రీరాములు సేవలు మరువలేనివి

కొత్తపల్లి: విద్యాభివృద్ధిలో ఎంఈఓ శ్రీరాములు సేవలు మరువలేనని జిల్లా విద్యాశాఖ అధికారి సుధాకర్ రెడ్డి అన్నారు. స్థానిక వెన్నెల గార్డెన్స్‌లో ఇనాయతుల్లా అధ్యక్షతన ఎంఈఓ–1 శ్రీరాములు పదవీ విరమణ సందర్భంగా సన్మాన కార్యక్రమం నిర్వహించారు. డీఈఓ మాట్లాడుతూ జిల్లాలోని మారుమూల మండలమైన కొత్తపల్లిలో ఎనిమిది సంవత్సరాల నుంచి విద్యాభివృద్ధికి కృషి చేశారని కొనియాడారు. అనంతరం ఎంఈఓ శ్రీరాములు దంపతులను సన్మానించారు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. అలాగే స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పీహెచ్‌ఎన్‌గా విధులు నిర్వహిస్తున్న అయేషా బేగం బుధవారం పదవీ విరమణ పొందారు. ఆమెను స్థానిక వైద్యాధికారులు దీప నాగవేణి, మహమ్మద్ బేగ్, సీహెచ్‌ఓ బాలకష్టయ్య, సిబ్బందితో కలిసి సన్మానించారు.

మంచి పనులతోనే గుర్తింపు


పెంచలమ్మను సన్మానిస్తున్న వైద్యులు, సిబ్బంది

మహానంది: ఉద్యోగి విధి నిర్వహణలో చేసిన మంచి పనులే కలకాలం గుర్తుంటాయని గాజులపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి వెంకటరెడ్డి, జిల్లా కంటి వైద్య అధికారి కృష్ణమోహన్‌రెడ్డి తెలిపారు. గాజులపల్లె పీహెచ్‌సీలో సీహెచ్‌ఓగా పనిచేస్తూ పదవీ విరమణ పొందిన పెంచలమ్మను బుధవారం ఘనంగా సన్మానించారు. ఆమె సేవలను కొనియాడారు. కార్యక్రమంలో డాక్టర్ దినేష్‌రెడ్డి, ఎంపీహెచ్‌ఈఓ హుసేన్‌రెడ్డి పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యం వహించొద్దు

మిడుతూరు: ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీలో నిర్లక్ష్యం వహించకుండా త్వరితగతిన పూర్తి చేయాలని ఎంపీడీఓ గంగావతి ఆదేశించారు. బుధవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పింఛన్ల పంపిణీపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పంపిణీలో ఆలస్యం చేయకుండా త్వరగా పూర్తి చేయాలని సూచించారు. ఉదయం ఆరు గంటలకు లబ్ధిదారుల ఇళ్లకు చేరుకొని పింఛన్ మొత్తాన్ని అందజేయాలని చెప్పారు.

రేపటి నుంచి ఈ-క్రాప్ నమోదు

వెలుగోడు: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఆగస్టు 2వ తేదీ నుంచి ఈ–పంట నమోదు ప్రారంభిస్తున్నట్లు ఏఓ పవన్ కుమార్ తెలిపారు. పకడ్బందీగా ఈ–పంట నమోదుకు శ్రీకారం చుడతామన్నారు. సున్నా వడ్డీ, పంట రుణాలతో పాటు పంట నష్ట పరిహారం, పంటల బీమా, పంట కొనుగోలుకు ఈ–పంట నమోదే ప్రామాణికం అని పేర్కొన్నారు. రైతు సేవా కేంద్రాల్లో పంట నమోదు చేసి జియో ట్యాగింగ్ చేస్తారన్నారు.

4న చౌడేశ్వరిదేవి జయంతి

ఆత్మకూరు: పట్టణంలోని తోటగేరిలో వెలిసిన చౌడేశ్వరిదేవిమాత ఆలయంలో ఈనెల 4న అమ్మవారి జయంతి వేడుకలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు మారబోతుల రామకృష్ణ తెలిపారు. ఆషాఢమాసం బహుళ అమావాస్య ఆదివారం రోజు చౌడేశ్వరిదేవి జయంతి వేడుకలు చేపడుతున్నట్లు చెప్పారు. ఉదయం 6 గంటలకు గణపతిపూజ, 7 గంటలకు క్షీరాభిషేకం, 8 గంటలకు సహస్రనామ కుంకుమార్చన, 9 గంటలకు దుర్గాహోమం, సాయంత్రం 3 గంటలకు బోనాల ఊరేగింపు, రాత్రి 8 గంటలకు తొట్లోత్సవం, 9 గంటలకు చౌడేశ్వరిదేవి భక్త బృందంతో భజన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

అలరించిన గాత్ర కచేరి



భక్తి గీతాలను ఆలపిస్తున్న కళాకారులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలం దేవస్థానం నిర్వహిస్తున్న ధర్మపథం కార్యక్రమంలో భాగంగా బుధవారం ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వద్ద సి.హెచ్. శేషవల్లి బృందం గుంటూరు వారిచే గాత్ర కచేరి కార్యక్రమం నిర్వహించారు. శ్రీగణపతిం, శివశివ మహాదేవ, భో.. శంభో, శంభో శివశంభో, నమశ్శివాయతే, శంభో శివ శంభో, కాలభైరావాష్టకం తదితర గీతాలను, అష్టకాలను సి.హెచ్. శేషవల్లి, బి. అంజనిదేవి, ఆర్.కౌసల్య తదితరులు ఆలపించారు.

ఐదుగురిపై చీటింగ్ కేసు

మహానంది: వరిధాన్యం బస్తాలు కొనుగోలు చేసి ఏడాది పూర్తయినా నగదు చెల్లించకపోవడంతో బాధిత రైతు యాట మల్లికార్జున ఫిర్యాదు మేరకు ఐదుగురిపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నాగేంద్రప్రసాద్ తెలిపారు. మహానంది మండలం తమ్మడపల్లె గ్రామంలోని మల్లికార్జునకు చెందిన 2400 బస్తాల వరిధాన్యాన్ని గుంటూరు జిల్లా పెదకాకానికి చెందిన కొండా శిరీష 2023లో రూ.30 లక్షలకు కొనుగోలు చేసింది. రైతుకు చెల్లించాల్సిన నగదులో రూ. 10లక్షలు మాత్రమే చెల్లించిందని, మిగిలిన రూ. 20 లక్షలు చెల్లించలేదన్నారు. రైతు మల్లికార్జున ఫిర్యాదు మేరకు కొండా శిరీష, ఆమె తల్లి, అన్న, మరో ముగ్గురిపై కేసు నమోదు చేశామన్నారు.

ఆకట్టుకున్న కోలాటం


కోలాటం నృత్యాలు ప్రదర్శిస్తున్న కళాకారులు

మహానంది: తెలుగు రాష్ట్రాలకు చెందిన బాలాజీ సేవాట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన కోలాటం, నృత్యప్రదర్శనలు భక్తులను ఆకట్టుకున్నాయి. గరుడనంది నుంచి ర్యాలీగా కోలాటం ప్రదర్శనలు నిర్వహిస్తూ మహానంది ఆలయం ముఖద్వారం వరకు చేరుకున్నారు. కోలాటం ప్రదర్శనలు భక్తులను ఈఓ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర అవధాని, ఏఈఓలు మధు, ఓంకారం వేంకటేశ్వరుడు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ శశిధర్‌రెడ్డి అభినందించారు.

నేటి నుంచి సామాజిక తనిఖీ

మహానంది: బండిఆత్మకూరు మండలంలో గురువారం నుంచి ఉపాధి హామీ పథకం పనులపై సామాజిక తనిఖీ ఉంటుందని ఎంపీడీఓ విజయ రావు తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఏపీఏ వసుధారెడ్డి ఆధ్వర్యంలో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ.. 2023–24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలంలో 1746 పనులు చేశామని తెలిపారు. వేతనాల రూపంలో రూ. 7.92 కోట్లు, మెటీరియల్ రూ. 1.86 కోట్లు కలిసి మొత్తం రూ. 9.78 కోట్లు మేర చేసిన పనులకు సామాజిక తనిఖీ ఉంటుందని చెప్పారు. గ్రామాల్లో ఉపాధి హామీ పథకం పనులపై ఏవైనా ఫిర్యాదులు, అభ్యంతరాలు ఉంటే సోషల్ ఆడిట్ దృష్టికి తీసుకురావచ్చని కోరారు. స్టేట్ రీసోర్స్ పర్సన్ మురారి, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం

మహానంది: బండిఆత్మకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద గురువారం ఉదయం 11 గంటలకు ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి తెలిపారు. వైద్యులు, కమిటీ సభ్యులు, సిబ్బంది హాజరుకావాలని కోరారు.